సూర్య ఘర్ యోజనకు చర్యలు తీసుకోండి


● కలెక్టర్ పి. రంజిత్‌బాషా



సోలార్ రూఫ్ టాప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశిం చారు. బుధవారం కలెక్టర్ చాంబరులో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో భాగంగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు సంబంధించి పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఈ పథకం అమలుపై సంబంధిత శాఖ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు ఇళ్ల పైకప్పుపై సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవ డానికి వంద చదరపు అడుగుల స్థలం అవసరం అవుతుందన్నారు. ఈ యూనిట్ ద్వారా నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఇందు కోసం రూ.60 నుంచి 70వేలు ఖర్చు అవుతుందని అన్నారు. ఇందులో సెంట్రల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ కింద రూ.30వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న www.pmsuryaghar.gov.in/APSPDCL వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ అధికారి వీరేంద్రబాబు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి, మున్సిపల్ కమిషనర్ రామ లింగేశ్వర్, ఎల్డీఎం రామచంద్రరావు, డీపీవో నాగరాజునాయుడు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీ మోహన్ రెడ్డి



కర్నూలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వైసీపీ అధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి నియమితుల య్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ముందు వరకు వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా నగర మేయర్ బీవై రామయ్య కొనసాగారు. ఆయన కర్నూలు పార్లమెంటు స్థానానికి వైసీపీ అభ్యర్థిగా దిగడంతో ఆ స్థానంలో కార్పొరేటర్ నారాయణమ్మను నియమించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్వీ మోహన్ రెడ్డిని అదిష్టానం ఎంపిక చేసింది. 2014లో కర్నూలు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎస్వీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఆశించారు. అధిష్టానం నిరాకరించడంతో మళ్లీ వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. ఆయన నమ్మకాన్ని నిలబెడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వివరించారు.

సబ్సిడీ వాహనాలకు దరఖాస్తులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: జిల్లాలో సబ్సిడీపై దివ్యాంగులకు అందించే మూడు చక్రాల మోటారు వాహనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఫాతిమా తెలిపారు. అర్హులైన వారు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్‌కార్డు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ వాహనం రిజిస్ట్రేషన్ తదితర పత్రాలను జత పరచాలని తెలిపారు. దరఖాస్తులను కర్నూలు నగరంలోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 08518-277864 నెంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

రేపు ఉద్యోగులకు కౌన్సెలింగ్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4: రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు అనుమతించడంతో జిల్లాలోని ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గ్రేడ్-2 వీఆర్వోలకు భూసర్వే సంబంధించిన ఉద్యోగులకు భూసర్వే కార్యాలయంలో అభ్యర్థులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 వీఆర్వోలు దాదాపు 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా భూసర్వే శాఖ ఉద్యోగులు 290 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

అగ్గిపెట్టె ఇవ్వలేదని..

● మద్యం మత్తులో బండరాయితో దాడి

నంద్యాల క్రైం, సెప్టెంబరు 4 : సిగరెట్ కాల్చేందుకు అగ్గిపెట్టె ఇవ్వలేదని మద్యం మత్తులో తల పగులగొట్టిన ఘటన నంద్యాలలో జరిగింది. ఎన్‌జీవోస్ కాలనీలోని ఓ బహిరంగ ప్రాంతంలో మద్యం సేవించిన గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపైకి వచ్చాడు. ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతుండగా అతడి వద్దకు వెళ్లి అగ్గిపెట్టె అడిగాడు. తన దగ్గర అగ్గిపెట్టె లేదని చెప్పడంతో పక్కనే ఉన్న రాయితో మనోహర్‌రెడ్డి తలపై దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు మనోహర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

గంజాయి సరఫరా కేసులో నలుగురి అరెస్టు

నంద్యాల క్రైం, సెప్టెంబరు 4 : గంజాయిని అక్రమంగా సరఫరా చేసే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ యుగంధర్‌బాబు బుధవారం తెలిపారు. నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు వ్యక్తులు పలుమార్లు అరకు నుంచి గంజాయి కొనుగోలు చేసి నంద్యాలకు తీసుకువచ్చి వారి అవసరం మేరకు అధిక ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని డీఎస్పీ తెలిపారు. అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది మంగళవారం నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 2.25కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు.

ఐదుగురికి రిమాండ్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 4 : గంజాయిని అక్రమంగా సరఫరా చేసే ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి బుధవారం తెలిపారు. నంద్యాల త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న దర్గా వద్ద ఐదుగురు గంజాయిని విక్రయిస్తుండటంతో అరెస్టు చేశామన్నారు. అరకు నుంచి గంజాయి కొనుగోలు చేసి నంద్యాలకు తీసుకువచ్చి వారి అవసరం మేర అధిక ధరకు అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారని సీఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు వారివద్ద ఉన్న 4 కేజీల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వర్సిటీల రూపురేఖలు మారేనా..?



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 4:

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వర్సిటీలను దారిలో పెట్టడానికి కసరత్తు జరుగుతోంది. ఈ క్రమంలో పాలక మండలి (ఈసీ) సభ్యులను రద్దు చేసి వాటి స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లను నియమించడానికి చర్యలు తీసుకోనున్నారని సమాచారం. వర్సిటీలను అభివృద్ధి వైపు తీసుకెళ్లి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది ఈ క్రమంలో ఇటీవల రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో ఉప కులపతులు, రిజిస్ట్రార్‌లు మారారు. కానీ పాలక మండళ్లు లేక పోవడంతో అభివృద్ధి, పనులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని విద్యార్థి సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి.

ఈసీలు లేక పేరుకుపోతున్న ఫైళ్లు...?

రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల్లో పెండింగ్ ఫైళ్లు పేరుక పోతున్నాయి. అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాల్లోని కీలకమైన పనులన్నీ నిలిచిపోయాయి. ఉద్యోగుల పదోన్నతులు, జీతభత్యాలు వంటి ప్రక్రియలు మాత్రమే యథావిధిగా కొనసాగుతున్నాయి. పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలంటే పాలక మండలి (ఈసీ) ఆమోదం పొందాలి. అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్, పదోన్నతుల వంటి అంశాలకు ఈసీ పర్మిషన్ తీసుకోవాలి. నూతన ఈసీని ఏర్పాటు చేయకపోవడంతో పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయని వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కీలక పదవుల్లో కొనసాగుతున్న వారిని, పాలక మండలి సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి వారిని విధుల నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు మూడు నెలలు అవుతున్నా వైసీపీ ప్రభుత్వం నియమించిన వారే పాలక మండలిలో కొనసాగుతున్నారు. దీంతో కీలక అంశాలు పెండింగ్‌లో పడ్డాయి.

● ఈసీల స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లు..!

● అక్రమాలకు చెక్ పెట్టేందుకు వ్యూహం

● వర్సిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఆశావహుల ఎదురు చూపు..

ఉన్నత విద్యనందించే వర్సిటీల్లో పారదర్శకమైన నిర్ణ యాలు, వాటి అమలుతో విద్యార్థుల భవిష్యత్, ఉద్యోగుల సంక్షేమం ఆధాపడి ఉంటుంది. ఇలాంటి పదవుల్లో అను భవం ఉన్న కీలక అధికారులను నిర్ణేతలుగా నియ మించా ల్సిన చోట అనర్హులకు అందలమెక్కించారు. పరీక్షల నిర్వ హణ, జవాబు పత్రాల మూల్యాంకనం, ఉద్యోగుల బది లీలు, ఉద్యోగోన్నతులు, ఇలా అనేక అంశాల్లో ఇష్టాను సారంగా వ్యవహరించారు. దీంతో గత ఐదేళ్ల వర్సిటీల ఖ్యాతి మసకబారిపోయిందనే విమర్శలు ఉన్నాయి.

ఇప్పటి వరకు నడిచింది ఇలా..

ఈసీ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. వర్సిటీల్లో డీన్, డైరెక్టర్, కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్స్, హెచ్‌వోడీ, వార్డెన్, మేనేజర్ తదితర పదవులను వీసీ నియమిస్తారు. వీసీల ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేస్తారు. వాటిని ఆమోదించేందుకు ఈసీ సమావేశం నిర్వహించాలి. రాయలసీమ యూనివర్సిటీల్లో ఏ విభాగంలో మార్పులు చేయలేదు.. పూర్తి స్థాయిలో మార్పులు, చేర్పులు చేయాలన్నా.. కొత్త ఆలోచనలు అమలు చేయాలన్నా ఈసీని నియమించాలి. వీటన్నిం టికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కోసం జిల్లాలోని మూడు వర్సిటీల అధికారులు, ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

ఈసీల స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లు..?

రాష్ట్రంలోని వర్సిటీల్లో పాలక మండళ్ల(ఈసీ) స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లను నియమిస్తారనే ప్రచారం ఉంది. ఈ కొత్త తరహా విధానాన్ని అమలు చేసి అక్రమాలకు చెక్ పెట్టాలనే ఆలోచనలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ముగ్గురు సభ్యులతో కూడిన ఒక కమిటీ వేసి నివేదిక తెప్పించుకున్నట్లు వర్సిటీలోని ఉపకులపతులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పాలక మండళ్ల వ్యవస్థకు స్వస్తి పలుకుతూ బోర్డు ఆఫ్ చైర్మన్స్‌ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ చైర్మన్లను కూడా రాష్ట్ర స్థాయిలో ఉండే ఉన్నత విద్యావంతులు, పారిశ్రామికవేత్తలు, కంపెనీల డైరెక్టర్లను ఇందులో సభ్యులుగా చేర్పితే అక్రమాలకు చెక్ పడటమే కాక వర్సిటీలను అభివృద్ధి చేయవచ్చనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే పాలక మండళ్ల నియామకంలో జాప్యం జరుగుతోందని వర్సిటీల్లోని కొందరు ఉపకులపతులు చెబుతున్నారు.

రిజర్వాయర్లను నింపండి

● జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

● ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 4: ఉమ్మడి జిల్లాలో వర్షాలు విపరీతంగా కురుస్తుండటంతో జల వనరుల శాఖ అధికారులు అన్ని రిజర్వాయర్లను నింపే విధంగా చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ మినీ సమా వేశం భవనంలో జరిగిన ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగా యి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈఓ జి. నాసరరెడ్డి పర్యవేక్షించా రు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వాతా వరణం అనుకూలంగా ఉంది. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, ఇన్ని రోజులు రిజర్వాయర్లను నింపుకోకుండా ఏం చేస్తున్నారని అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు, మండల కేంద్రం, గ్రామాల్లోని ఆసుపత్రులను తనిఖీ చేయాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామంలో నిర్మిస్తున్న పవర్‌గ్రిడ్‌లో పని చేస్తున్న చైన్ ఎక్స్‌కవేటర్లను పన్నుల చెల్లించాలని, ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. తక్షణమే వాటిని విడిచిపెట్టాలని ఆదేశించారు. నూతనంగా అమలులోకి వచ్చిన డ్రైవింగ్ లైసెన్సుపై అవగాహన నిర్వహిం చాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీలు అడిగిన ప్రశ్నలకు అధికారులు లిఖిత పూర్వకంగా సమాధానాలు చెప్పాలని ఆదేశించారు. నాడు-నేడు కింద ప్రారంభమైన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రాల్లోని ఆర్టీసీ బస్టాండులను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్, ఎస్సీ వెల్ఫేర్ నుంచి వచ్చిన నిధులను పంచాయతీరాజ్ విభాగం అధి కారులు సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇప్ప టికే ఆలస్యమైందని, ఈ నెలాఖరుకు నిధులను ఖర్చు పెట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలో రూ.30 అదనంగా ఎరువులను విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో మత్స్యకారులకు కొత్తగా లైసెన్సులు ఇవ్వడం తోపాటు ఉన్న వారికి రెన్యువల్ చేయాలని కోరారు. గోరుకల్లు నుంచి డోన్ నియోజవర్గానికి నీళ్లు తీసుకెళ్లి తమ నియోజకవర్గానికి తాగు నీరు లేకుండా చేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. అధికారులు పునరాలోచించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. ఇంకా పలువురు సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు దివ్య, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బ్రాహ్మణదొడ్డి నుంచి పోలకల్లుకు రాకపోకలు బంద్



వర్షానికి కొట్టుకు పోయిన బ్రాహ్మణదొడ్డి రోడ్డు

సి. బెళగల్, సెప్టెంబరు 4: మండలంలోని పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి గ్రామాలలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బ్రాహ్మణదొడ్డికి- పోలకల్లుకు మధ్య ఉన్న రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు బందయ్యాయి. దీని వల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలకల్లు గ్రామ రైతుల పొలాలు బ్రాహ్మణదొడ్డి పొలిమేరలో ఉన్నాయి. ఈ దారెంట ఎద్దుబండ్లు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఈ మార్గంలో రోడ్డు వేయాలని రెండు గ్రామాల రైతులు కోరుతున్నారు.

మామపై అల్లుడి దాడి

సి. బెళగల్, సెప్టెంబరు 4: మండల కేంద్రానికి చెందిన వేణు తెలంగాణ రాష్ట్రం వడ్డెపల్లి మండలం వెంకటాపురం నుంచి వచ్చిన మామ శ్రీనివాసులుపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. సి బెళగల్‌లో చనిపోయిన బంధువు అంత్యక్రియలకు కుటుంబ సభ్యులతో శ్రీనివాసులు వచ్చాడు. ఈ సందర్భంగా వేణు ఆగ్రహంతో ఇనుప రాడ్డు తీసుకొని మామ తలపై కొట్టాడు. బంధువులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో శ్రీనివాసులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

తండ్రి మందలించాడని..

ఇల్లు వదిలి వెళ్లిపోయిన ఇంటర్ విద్యార్థి

గోనెగండ్ల, సెప్టెంబరు 4: అల్లరిగా తిరగవద్దని, పరీక్షలు దగ్గర పడుతున్నాయని తండ్రి మందలించినందుకు అలిగి అనిల్ కుమార్ అనే విద్యార్థి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. పూజారి వెంకటేశ్వర్లు గోనెగండ్లలో రేషన్ డీలర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన రెండో కుమారుడు అనిల్‌కుమార్ ఎమ్మిగనూరులోని వైష్ణవి కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వెంకటేశ్వర్లు తన కుమారుడిని అల్లరిగా తిరగవద్దని మందలించాడు. దీంతో అనిల్‌కుమార్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మంగళవారం దాకా తిరిగి రాకపోవడంతో బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో పూజారి వెంకటేశ్వర్లు, తల్లి పద్మావతి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

● జిల్లాలో 23 మంది ఎంపిక ● నేడు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానోత్సవం

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: కర్నూలు జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 23 మంది ఎంపికయ్యారు. ఉపాధ్యాయ అవార్డుకు జిల్లా వ్యాప్తంగా 32 మంది ఉపాధ్యాయులు 15 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారి నుంచి దరఖాస్తులు వచ్చాయి. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఆధ్వర్యంలో ఈ దరఖాస్తులను పరిశీలించి విద్యార్థులకు ఉత్తమ సర్వీసు ఇచ్చిన 23 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అవార్డుకు ఎంపికైన వారిని గురువారం ఉదయం 10 గంటలకు కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ పి. రంజిత్ బాషా సన్మానిస్తారని డీఈవో శామ్యూల్ తెలిపారు. అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు డీఈవో తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలు

పేరు	సబ్జెక్టు	పాఠశాల పేరు	మండలం
నరసింహారెడ్డి	ఎస్ఏ (బీఎస్)	జడ్పీహెచ్ఎస్, ఆర్‌జీనగర్ ఆదోని	
వెంకటసుబ్బయ్య	ఎస్ఏ (పీఎస్)	జడ్పీహెచ్ఎస్, దొండనగేరి	ఆదోని
ఎస్. వెంకోబ	పీఎస్ హెచ్ఎం	ఎంపీపీఎస్, విరుపాపురం	ఆదోని
ఎన్. రాజు సతీష్	ఎస్ఏ (పీఎస్)	మున్సిపల్ హెచ్ఎస్, 2వ వార్డు	ఆదోని
నరసింహులు	టీజీటీ (తెలుగు)	డా. అంబేడ్కర్ గురుకుల	ఆరేకల్
టి. శ్రీనివాసులు	పీఎస్ హెచ్ఎం	ఎంపీపీఎస్, మొలగవెల్లి	ఆలూరు
మంజులమ్మ	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్, మెయిన్	ఆలూరు
మారంబీ	ఎస్ఏ (హిందీ)	జడ్పీహెచ్ఎస్	ఆస్పరి
పట్టె ఎల్లప్ప	పీఎస్‌హెచ్ఎం	ఎంపీపీఎస్ (బీసీ)	ఆస్పరి
కేఎం బీసమ్మ	ఎస్ఏ (సోషల్-కెనడ)	జడ్పీహెచ్ఎస్ గూళ్యం	హాలహర్వి
ఏఎం సుధాశేఖర్	పీఎస్‌హెచ్ఎం	ఎంపీపీఎస్ సిద్దాపురం	హాలహర్వి
సిద్ధలింగ	పీఎస్‌హెచ్ఎం	ఎంపీపీఎస్ హోసనహల్లి	హాలహర్వి
సయ్యద్ అఫ్జారున్నీసా	ఎస్ఏ (బీఎస్)	జడ్పీహెచ్ఎస్, హెబ్బటం	హాలహర్వి
శ్రీనివాసరెడ్డి	ఎస్ఏ(బీఎస్)	జడ్పీహెచ్ఎస్, ముజఫర్‌నగర్	కల్లూరు
పుష్పావతమ్మ	పీఎస్‌హెచ్ఎం	ఎంపీపీఎస్, నిర్మల్‌నగర్	కల్లూరు
పి. ఈశ్వరప్ప	ఎస్ఏ(బీఎస్)	జడ్పీహెచ్ఎస్, కందుకూరు	కోసిగి
మహ్మద్ రఫిక్	ఎస్ఏ (ఇంగ్లీష్)	జడ్పీహెచ్ఎష్, మునగాలపాడు	కర్నూలు
కిరణ్ కుమార్	పీఎస్‌హెచ్ఎం	ఎంపీపీఎస్, ఆర్‌కే దుద్యాల	కర్నూలు
ఎ. వేణుగోపాల్	ఎస్ఏ (తెలుగు)	జడ్పీహెచ్ఎస్, తుంగభద్ర	మంత్రాలయం
నాగేశ్వరయ్య	ఎస్‌జీటీ	జీవీ తండా	ఓర్వకల్లు
వి. విక్టోరియం	పీహెచ్ఎస్ఎం	ఎంపీపీఎస్	పెద్దకడుబూరు
కే. విజయకుమారి	ఎస్ఏ (మ్యాథ్స్)	జడ్పీహెచ్ఎస్ హనుమాపురం	పెద్దకడుబూరు
జి. వెంకటరమణ	ఎస్ఏ (హిందీ)	జడ్పీహెచ్ఎస్, దైవందిన్నె	ఎమ్మిగనూరు

వ్యక్తి ఆత్మహత్య

అవుకు, సెప్టెంబరు 4 : అవుకు మండలం సంగ పట్నం గ్రామానికి చెందిన చాకలి చిన్న అంకాలు (31) పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాజారెడ్డి వివరాల మేరకు.. చిన్న అంకాలు మద్యానికి బానిసై భార్య లక్ష్మితో గొడవ పడే వాడు. మద్యం తాగటా నికి భార్య డబ్బులు ఇవ్వలే దని తెల్లవారు జామున పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమ నించి అవుకు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 4: మండలం లోని మాయలూరు గ్రామానికి చెందిన ఎడుగురు పేకాటరా యుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామాంజనే యరెడ్డి బుధవారం తెలిపారు. గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ సమీపంలో పేకాట ఆడుతు న్నట్లు సమాచారం రావటం తో సిబ్బందితో కలిసి దాడు లు చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక


ఫర్హానా


జీనత్ జహాన్

పాణ్యం, సెప్టెంబరు 4: మండలంలోని మోడల్ పాఠశాల పీజీటీ ఎకనామిక్స్ ఉపాధ్యాయిని ఎస్.ఫర్హానా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం రోజు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారం అందుకుంటున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను అభినందించారు.

గడివేముల: మండలంలోని గని ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న జీనత్ జహాన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవో విమల వసుంధరాదేవి తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జీనత్‌జహాన్ కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా బేబి బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న బేబి

నందికొట్కూరు, సెప్టెంబరు 4: నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా బేబి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ నందికొట్కూరులో మేనేజర్‌గా పని చేశానని, నందికొట్కూరుపై పూర్తి అవగాహన ఉందని అన్నారు. మిగతా మున్సిపాలిటీలతో పోల్చితే నందికొట్కూరు అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందన్నారు. పట్టణాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని, తనకు కౌన్సిలర్లు సహకరించాలని ఆమె కోరారు. అనంతరం ఆమె టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సాయంత్రం పట్టణంలోని సుబ్బారావు పేటలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలను శుభ్రం చేయాలని సూచించారు.

ఆత్మకూరు అర్బన్ సీఐగా ఓబులేసు


బాధ్యతలు తీసుకుంటున్న ఓబులేసు

ఆత్మకూరు, సెప్టెంబరు 4: ఆత్మకూరు అర్బన్ సీఐగా ఓబులేసు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ మదనపల్లి ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా పుత్తూరు సీఐగా పనిచేస్తున్న ఓబులేసు ఇక్కడికి వచ్చారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఆత్మకూరు పోలీసుస్టేషన్ సిబ్బంది సీఐ ఓబులేసు కలిసి పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా ఎన్ఎండీ ఫిరోజ్ జన్మదినం


నాయకుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 4: టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎన్‌టీఆర్ షాదిఖానాలో ఫిరోజ్ యువసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి వేడుక చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో అన్నదాన కార్యక్రమంలో చేపట్టారు. అంధుల పాఠశాలలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం కార్యక్రమం చేశారు. కొన్ని వార్డుల్లో వార్డు ఇన్‌చార్జిలు దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాకిట్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిసెపై కూలిన భారీ వృక్షం


గట్టు తండాలో గుడిసెపై కూలిన భారీ వృక్షం

వెలుగోడు, సెప్టెంబరు 4: వెలుగోడు అటవీ సమీపంలోని గట్టు తండాలో బుధవారం తెల్లవారుజామున గుడిసెపై భారీ వృక్షం కూలింది. భారీ వర్షాల కారణంగా ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో సక్రునాయక్ కుటుంబ సభ్యులు మరో ఇంట్లో నిద్రించడంతో పెను ప్రమాదం తప్పింది.


బడికి వెళ్లాలంటే బురద దాటాల్సిందే..!


పాఠశాల ఎదుట బురదలో వెళ్తున్న విద్యార్థులు

కొత్తపల్లి, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని ఎంపీయూపీ పాఠశాల ఎదుట మట్టిరోడ్డు బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు బురదలో నడుస్తూ పాఠశాలకు అతి కష్టం మీద చేరుకున్నారు. ప్రధాన రహదారి నుంచి స్కూలు వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, రోడ్డు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలి

● న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 4: ప్రజా పాలనకు ఎలాంటి విఘాతం లేకుండా పనిచేయడానికి ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పనిచేయాలని న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. నంద్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఫరూక్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపై తక్షణ స్పందన ఉండాలన్నారు. ఆర్థికపరమైన కొన్ని సమస్యలను నిర్దిష్టమైన నివేదికల ద్వారా అందజేయడంతో వాటిపై ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా కృషి చేస్తుందని చెప్పారు. నంద్యాల జిల్లా నూతనంగా ఏర్పడిందని, జిల్లా అభివృద్ధికి అవసరమైన వసతులు, వనరులు సమకూర్చడానికి కృషి చేస్తామని అన్నారు. సీఎం చంద్రబాబు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. విజయవాడలో జరుగుతున్న వరదల పరిస్థితులను గమనిస్తూ రేయింబవళ్లు పర్యటిస్తూ ప్రజలకు మనోధైర్యాన్ని ఇస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు పాలనా దక్షతకు ఇది నిదర్శనమని అన్నారు. నంద్యాలలోని పలు విద్యార్థి వసతి గృహాల్లో ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజన సదుపాయాలు కల్పించడం లేదన్న విషయం కలెక్టర్ నియమించిన కమిటీ నివేదికల ద్వారా తమ దృష్టికి వచ్చిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

టీడీపీలో చేరిక


టీడీపీలో చేరుతున్న బిజినవేముల సర్పంచ్, వార్డు సభ్యులు

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 4: మండలంలోని మల్యాల గ్రామం నుంచి వైసీపీకి చెందిన దాదాపు 30 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. అల్లూరు గ్రామంలోని మాండ్ర నివాసంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో టీడీపీ నాయకులు బాల మద్దయ్య, మద్దిలేటి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర, ఎమ్మెల్యే జయసూర్య టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాముడు, వెంకటేశ్వర్లు, మధు, యోహాను, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ నందికొట్కూరు మండల అధ్యక్షుడు, బిజినవేముల గ్రామ సర్పంచ్ రవి యాదవ్ పలువురు వార్డు మెంబర్లు, వంద కుటుంబాలతో కలిసి బుధవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు లలితమ్మ, మనోజ్ఞ, పద్మావతి, సరోజమ్మ, మహ్మద్ రఫి, మాసుం, ఏసురత్నం, మరియమ్మ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

'వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేశ్ కుమార్

పాములపాడు, సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ సురేశ్ కుమార్ సూచించారు. పాములపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండపాల వద్ద నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలు ఏర్పాటు చేయవద్దని, బాణాసంచా కాల్చవద్దని సూచించారు.

'విజయవంతం చేద్దాం'

ఆత్మకూరు, సెప్టెంబరు 4: వినాయక చవితి ఉత్సవాలను విజయంతం చేద్దామని ఆత్మకూరు వినాయక ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు కంచర్ల గోవిందరెడ్డి, అధ్యక్షులు గరుడాద్రి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని చౌడేశ్వరీదేవి కల్యాణ మంటపంలో బుధవారం వినాయక మంటప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ న్యాయ సలహాదారుగా గరుడాద్రి సుదర్శన్, ఉపాధ్యక్షులుగా వంగాల భాస్కరరెడ్డి, ఎం.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా రాసంశెట్టి చంద్రశేఖర్, కోశాధికారిగా శేగు కిరణ్‌కుమార్, కార్యదర్శులుగా సుబ్బరాయుడు, వెంకటేష్, బర్నాల రమేష్, శివనాయక్, ప్రచార కార్యదర్శిగా ఆవులరెడ్డి నియమితులయ్యారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీధర్‌గుప్తా, మారం భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ


విచారణ చేస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 4: ఉపాధి నిధులను సక్రమంగా వినియోగించకుండా, ఉద్యోగుల కుటుంబాలకు, మృతిచెందిన వారికి ఉపాధి నిధులను ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి సిబ్బంది కలిసి వారి ఖాతాలకు జమచేశారని సర్పంచ్ బాలయ్య, ఎంపీటీసీ వెంకటమ్మతో పాటు గ్రామస్థులు ఉపాధి పీడీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం జూపాడుబంగ్లాలోని గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. విచారణకు ఏపీడీ అన్వరాబేగం, అంబుడ్స్‌మన్ సురేంద్రకుమార్ హాజరయ్యారు. అయితే ఏపీవో గౌరిబాయి, ఎంపీడీవో నూర్జహాన్ ఆలస్యంగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ సమయంలో ఎక్కడికి వెళ్లేదంటూ మండిపడ్డారు. అప్పటికే సచివాలయం వద్ద భారీస్థాయిలో గ్రామస్థులు, ఇరువర్గాల టీడీపీ నాయకులు రావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఏఎస్ఐ మేరీజయంతి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విచారణ సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. విచారణ అధికారులు వచ్చిన వారి ఖాతాల వివరాలు, జాబ్‌కార్డులు, పనిప్రదేశంలో చేసిన ఫొటోలు తదితర వాటిని పరిగణనలోనికి తీసుకొని విచారించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విచారణ చేసి నివేదికను పీడీకి అందజేస్తామని విలేకరులకు తెలిపారు. ఫిర్యాదుదారులు ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని విచారణ అధికారులకు జిరాక్సు ప్రతులను సమర్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కూడా పనులు చేసిన ఫొటోలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

'యాజమాన్య పద్ధతులు పాటించాలి'

వెలుగోడు, సెప్టెంబరు 4: మండలంలోని రైతులు తమ పంట పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు అంజనేయ సూచించారు. మండలంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను బుధవారం పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ వరి పంటలో నిలిచిన వర్షపు నీటిని తొలగించకపోతే కలిగే నష్టాల వివరించారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను కచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


గడిగరేవులలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గడివేముల, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న మినుము పంటను బుధవారం నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి పరిశీలించారు. రైతులను అడిగి వివరాలను సేకరించారు. పూత దశలో ఉన్న మినుము పంట వర్షాలకు దెబ్బతిని మొలకలు వచ్చాయని రైతులు అధికారులకు వివరించారు. వేలాది రూపాయలు పెట్టుబడి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 300 ఎకరాల మినుము పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మరో రెండు రోజులు క్షేత్రస్థాయిలో పైర్లను పరిశీలించి పూర్తి నివేదికను అందిస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'


వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

మహానంది, సెప్టెంబరు 4: నల్లమల సమీపంలోని గూడెంలో నివసించే గిరిజనులు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి సూచించారు. మహానంది సమీపంలోని గూడెంలోని గిరిజనులకు మండలంలోని ఎం.తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీహెచ్‌ఈవో మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, సిబ్బంది సునీత, సికిందర్, విజయ్‌తో పాటు ఆశా వర్కర్లు, వెంకటలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

'గిరిజన గూడేల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తాం'

కొత్తపల్లి, సెప్టెంబరు 4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గిరిజన గూడేల్లో కనీస సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మేరీ తెలిపారు. బుధవారం కొత్తపల్లిలోని భ్రమరాంబ చెంచుగూడెంలో ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో పీఎం జన్‌మాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గూడేల్లో నివసిస్తున్న చెంచులకు ఆధార్, బ్యాంకు అకౌంటు, రేషన్ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు లేని వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి త్వరలో అందరికి ఇస్తామన్నారు. గూడేల్లోని అర్హులకు పింఛన్లు కూడా ఇస్తామన్నారు. గూడేలలో తాగునీరు, రోడ్లు, వైద్యసదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈసీ శ్రీనివాసులు, ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, పంచాయతీ సెక్రటరీ చిన్నస్వామి, చెంచు సమాఖ్య కమిటీ కోఆర్డినేటర్ యూసఫ్ తదితరులు ఉన్నారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 4: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన్‌కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కేజీ నాయక్ సూచించారు. బుధవారం కొట్టాలచెరువు గూడెంలో పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గిరిజనులకు ఇప్పటివరకు అందని పథకాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. గిరిజనులకు పక్కా గృహాలు, ఇంటింటికి కొళాయిల ఏర్పాటు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం, నాణ్యమైన విద్య, వైద్యం అందించడంతో పాటు జీవనోపాధి అందించడానికి జన్‌మన్ కమిటీ కృషి చేస్తుందని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల, పీఆర్ ఏఈ వెంకట సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు'

పాణ్యం, సెప్టెంబరు 4: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని ఎంపీడీవో దస్తగిరి తెలిపారు. నాలుగేళ్లుగా మురుగు సమస్యను ఎదుర్కొంటున్న ఏపీ గిరిజన గురుకుల పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మురుగు వెళ్లడానికి అనువైన ప్రాంతాన్ని సర్వే చేసినట్లు తెలిపారు. మురుగు వెళ్లడానికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆర్‌అండ్‌బీ స్థలంలోని పాడుబడ్డ బావిని ఇంకుడు గుంతగా మార్చడానికి అధికారులతో చర్చించినట్లు తెలిపారు. సర్వేయర్ మల్లిక, వీఆర్వో బీరేంద్ర, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సచివాలయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి: సీపీఐ


నందికొట్కూరులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 4: నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యులు, పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం కేజీ రోడ్డుపై ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, నూనె, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీనికి తోడు పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందే తప్ప పేదలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 200 రెట్లు అధికంగా రేట్లు పెరిగాయని ఆరోపించారు. సామాన్యులు మూడు పూటలా భోజనం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారరు. అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఆహార భద్రత చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రజితమ్మ, భాను, సులోచనమ్మ, ఏఐటీయూసీ వెంకటేశ్వర్లు, డేవిడ్ రమేష్, దావీద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, భార్గవ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆపార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా 16 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారని, అదేతరహాలో మన రాష్ట్రంలో కూడా నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు హరికృష్ణ, వెంకటశివుడు, స్వాతి, ముర్తుజావలి, సిద్ధయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ఒక్క రోజు వేతనం విరాళం

మహానంది, సెప్టెంబరు 4: రాష్ట్రంలోని వరద బాధితులకు మహానంది దేవస్థానం రెగ్యులర్ ఉద్యోగులు 50 మంది ఒక్క రోజు వేతనం ఇవ్వడానికి ముందుకువచ్చారు. బుధవారం రూ.76,662 డీడీ తీశారు. ఈ డీడీని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ద్వారా దేవదాయశాఖ కమిషనర్‌కు పంపుతున్నట్లు ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు చండూరి రవిశంకర్ అవధాని బుధవారం తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖలోని 11 ప్రధాన దేవస్థానాల నుంచి వరద బాధితులకు చెయ్యాలని రాష్ట్ర దేవస్థానం ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు హరిబాబు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ మేరకు వరద బాధితులకు ఒక్కరోజు వేతనం ఇవ్వడానికి మహానంది ఆలయ ఉద్యోగులు ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మహానంది, సెప్టెంబరు 4: గాజులపల్లి ఆర్ఎస్ గ్రామానికి చెందిన జువ్వాజీ దాస్(62) ఈ ఏడాది జూన్ 26వ తేదిన తలకు గాయమై మృతి చెందారు. అనుమానస్పద మృతిగా భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు గతంలో కేసు నమోదయినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. తర్వాత కేసు విచారణలో భాగంగా బుధవారం అదే గ్రామానికి చెందిన కోలా మోహన్ అనే వ్యక్తి జువ్వాజి దాస్‌ను చలిక పారతో తలపై కొట్టి హత్య చేసినట్లు వీఆర్వో జయరాముడు వద్ద లొంగిపోయి నేరం అంగీకరించారు. కోలా మోహన్‌ను వీఆర్వో మహానంది పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నేరం ఒప్పుకోవడంతో నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హోటళ్లలో చోరీ

మహానంది, సెప్టెంబరు 4: మండలంలోని ఎం.తిమ్మాపురంలో ఒకే రోజు రాత్రి రెండు హోటళ్లలో చోరీ జరిగింది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి బుధవారం తెలిపని వివరాలివీ.. తిమ్మాపురం బస్టాండ్ పరిసరాల్లోని అచ్చయ్య, సుభాష్ హోటళ్లు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ హోటళ్లలో తాళాలు పగలగొట్టి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆయిల్ డబ్బాలతోపాటు ఇతర వస్తువులను ఎత్తుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మద్యం స్వాధీనం

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 4: నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామం వద్ద ఉన్న కేసీ కెనాలు బ్రిడ్జి వద్ద చేపట్టిన సాధారణ తనిఖీల్లో 30 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాలివీ.. నందికొట్కూరు పట్టణానికి చెందిన ఈడిగ భాస్కర్ అనే బైకుపై మద్యం బాటిళ్లను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. భాస్కర్‌పై కేసు నమోదు చేసి బైకును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిడుతూరు: మండలంలోని కలమందలపాడు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న రాజేష్‌ను అదుపులోకి తీసుకొని 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఓబులేసు చెప్పారు. మద్యం విక్రేతపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'పంట నమోదు తప్పనిసరి'

మహానంది, సెప్టెంబరు 4: పంట నమోదు తప్పనిసరి అని, అలాగే నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని సీతారామపురంలో పంట నమోదు చేసుకున్న రైతుల ఈకేవైసీని బుధవారం ఈవో పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేసుకోవడానికి, ఈకేవైసీ చేసుకోవడానికి సెప్టెంబరు 15వ తేదీ ఆఖరు అని తెలిపారు. పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే పథకాలు వర్తిస్తాయని చెప్పారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత

మహానంది, సెప్టెంబరు 4: మండలంలోని బుక్కాపురం శ్రీకృష్ణ ఎరువులు, పురుగుల మందు దుకాణానికి సంబంధించి సరైన అనుమతులను యజమాని చూపకపోవడంతో అమ్మకాలను నిలిపి వేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం దుకాణాన్ని తనిఖీ చేశారు. రూ.6.72 లక్షల విలువ చేసే 24 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేశామని ఏవో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ పోస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. స్టాక్ నిల్వల బోర్డును ప్రతిరోజు దుకాణం ముందు ఉంచాలని ఆదేశించారు.

'పంట నష్టం నివేదిక త్వరగా ఇవ్వాలి'

మిడుతూరు, సెప్టెంబరు 4: భారీ వర్షాల వల్ల దెబ్బ తిన్న పంటల నివేదికను త్వరగా ఇవ్వాలని వ్యవసాయాధికారి పీరునాయక్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. మండలంలోని చింతలపల్లి, మిడుతూరు, పీరుసాహేబ్‌పేట, దేవనూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు పంట నమోదును పూర్తి చేయాలన్నారు. రైతు సేవా కేంద్రం వ్యవసాయ సిబ్బంది అశోక్, శ్రీలత, దేవకుమార్, చంద్రకళ ఉన్నారు.

'టీడీపీతోనే బీసీల అభ్యున్నతి'

నంద్యాల క్రైం, సెప్టెంబరు 4: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శేషాద్రి గౌడ్ అన్నారు. నంద్యాలలోని జిల్లా గౌడ సంఘం కార్యాలయంలో బుధవారం జిల్లా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. శేషాద్రి గౌడ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని అన్నారు. బీసీల్లోని ఉప కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పడుతుందని చెప్పారు. విజయవాడలో వరద ప్రభావితంతో బాధితులకు అన్ని విధాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజానేతగా ఉంటూ సహాయసహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. ఆళ్లగడ్డ పట్టణ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మాధవ, అధ్యక్షుడిగా రమణ, కార్యదర్శిగా యువరాజు, ఉపాధ్యక్షుడిగా నాగేష్, అధికార ప్రతినిధిగా సుబ్బారావు, కోశాధికారిగా రంగస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పక్కీరయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, అధికార ప్రతినిధి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఒప్పంద జీవోలు ఇవ్వాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 4: ఆశా కార్యకర్తలకు సంబంధించిన ఒప్పంద జీవోలను వెంటనే ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భారతి, వరలక్ష్మి, ఇందిరమ్మ కోరారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ అధికారిణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులతో జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. పనిభారంతో పాటు అదనపు పనులను చేయిస్తున్నారని, సెలవులు కూడా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలకు మేలు జరిగేలా జీవోలు అమలు చేయాలని కోరారు. సంఘం నాయకులు శాంతి, నాగలక్ష్మి, అపర్ణ, జ్యోతి, లింగమ్మ, రవణమ్మ, సామక్క ఉన్నారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

పాములపాడు, సెప్టెంబరు 4: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యురాలు నాగలక్ష్మి సూచించారు. పాములపాడు పీహెచ్‌సీలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో వర్షాలతో భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, ప్రతి ఒక్కరూ వేడినీరు తాగాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, ఆటువంటి ప్రాంతాల్లో వేస్టు ఆయిల్ చల్లాలని సూచించారు.

'చెరువుల భద్రతపై ప్రత్యేక దృష్టి'

పాణ్యం, సెప్టెంబరు 4: భారీ వర్షాల దృష్ట్యా మండలంలోని చెరువుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం కొందరు రైతులు కొత్త చెరువు కట్ట కుంగినట్లు తెలపడంతో హుటాహుటిన చెరువును పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చెరువు కట్ట, తూములు పరిశీలించి ఎలాంటి సమస్య లేదని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ అధికారి అర్జున్‌సింగ్‌తో చెరువుల భద్రతపై చర్చించామని చెప్పారు. ప్రస్తుతం కొత్త చెరువుకు నీరు భారీగా చేరిందని, కట్టకు గండ్లు పడే పరిస్థితి లేదని సంబంధిత అధికారులు తెలిపారని చెప్పారు. ఇప్పటి వరకు మండలంలోని కుందూ పరివాహక ప్రాంతాలలో ఎటువంటి సమస్యలేదన్నారు. తొగర్చేడు. మద్దూరు, అనుపూరు గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. మండలంలో 837 మట్టి మిద్దెలను గుర్తించి యజమానులకు నోటీసులు అందజేశామన్నారు. కురుస్తున్న వర్షాలకు ఇప్పటి వరకు తొమ్మిది మట్టి మిద్దెలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. బలపనూరులో పశువుల పాక కూలి వడ్డు సుధాకర్‌రెడ్డికి చెందిన ఒక ఎద్దు చనిపోయిందన్నారు. ఆర్ఐ మహేశ్వరరెడ్డి, వీఆర్వో బీరేంద్ర, మత్స్యకారులు, రైతులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మొక్కలు నాటుదాం


రుద్రవరం, అప్పనపల్లె రహదారిలో మొక్క నాటుతున్న నాయకులు

రుద్రవరం, సెప్టెంబరు 4 : మండలంలోని అప్పనపల్లె, రుద్రవరం రహదారిలో బుధవారం టీడీపీ నాయకులు రంగనాయకులు, కోలా గురుమూర్తి, నంద్యాల ఎస్సీ సెల్ పార్లమెంటు కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, అల్లాడి చంద్రశేఖర్‌రావులు ఉపాధి హామీ పథకం కింద రహదారికి ఇరు వైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈసీ సుబ్బన్న, ఏరువ క్రిష్ణమూర్తి, సురేశ్ మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, సెప్టెంబరు 4: చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను ఎంఈవో అనూరాధ బుధవారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో సునిత, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

68వేల పనిదినాలు పూర్తి చేయాలి

రుద్రవరం: మండలంలో మిగిలిన 68వేల పనిదినాలు పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉపాధి పథకం కింద 90 రోజులు చేయాల్సినటువంటి కుటుంబాలకు సంబంధించి 68వేల పనిదినాలు మిగిలి ఉన్నాయని వాటిని సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ప్రతాప్, వీసీ సుబ్బన్న, హౌసింగ్ ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

బనగానపల్లె , సెప్టెంబరు 4: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలతో పాటు కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాల్సి ఉండగా కేవలం బియ్యం, చెక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, సంజీవులు, శివయ్య, శివబాలకృష్ణ, కుళాయిస్వామి, ఇమాములు, రవి, బాల సంజీవులు, నాగాంజనేయులు, వెంకటేశ్వర్లు, శివనాగయ్య, ఎర్రన్న, హుసేని గంగన్న, నాగన్న పెద్దమునయ్య, నాగరాజు, నర్సమ్మ, వెంకటమ్మ, లక్ష్మీదేవి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా 6న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, డి.దస్తగిరి, ఉదయ్, ఎల్లకృష్ణ, పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు


కుందర వాగు వంతెనను పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 4: ఉయ్యాలవాడ - ఆళ్లగడ్డకు ఇంజేడు మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. బుధవారం ఇంజే డు గ్రామ సమీపంలోని కుందర వాగు వంతెనను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ వరద ఉధృతి తగ్గే వరకు వాహనదారులు పెద్దయమ్మనూరు, సర్వాయిపల్లె గ్రామాల మీదుగా లేదా ఆర్.పాంపల్లె గ్రామం మీదుగా ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ పట్టణానికి రాకపోకలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య, సుభాన్, బాషా, వీఆర్వో దాదా సాహెబ్ ఉన్నారు.

వరద బాధితుల కోసం ఆర్థిక సాయం


ఎమ్మెల్యేకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయకుడు

రుద్రవరం, సెప్టెంబరు 4 : విజయవాడ వరద బాధితుల కోసం రుద్రవరం మండలానికి చెందిన టీడీపీ యువ నాయకుడు బాచుపల్లె వెంకటరమణ, మధుసూదనరెడ్డి రూ.20 వేలు బుధవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు అందించారు. విజయవాడలోని వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధి కి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే ద్వారా ఆర్థిక సా యం అందించారు. ఆలమూరు నుంచి మరొకరు కొండమాయపల్లె నుంచి ఆర్థిక సాయం అందించారు.

శ్రీకృష్ణుడి శోభా యాత్ర


శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 4 : శ్రీకృష్ణుడి శోభా యాత్ర కొలిమిగుండ్లలో బుధవారం వైభవంగా సాగింది. త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు బాబు, హరి, కుమార్, నవీన్, అశోక్ తదితరుల ఆధ్వర్యంలో గతనెల 26న కొలిమిగుండ్లలో ప్రతిష్ఠించారు. గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు అందెరాము, పోరెడ్డి చిన్నపురెడ్డి పాల్గొన్నారు.

ఉమేష్ చంద్ర సేవలు మరువలేనివి

డోన్(రూరల్), సెప్టెంబరు 4: రాష్ట్ర ఉన్నత పోలీసు అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర సేవలు మరువలేనివని డోన్ రూరల్ సీఐ సీఎం రాకేష్‌బాబు అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉమేష్ చంద్ర వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


5వేలు చెత్త బుట్టలు మంజూరు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 4 : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు సంభందించి 5వేలు చెత్త బుట్టలు మంజూరైనట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి బుధవారం వెల్లడించారు. ప్రజలు చెత్తను రోడ్లపై, ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉండటానికి ప్రభుత్వం ఈ చెత్త బుట్టలను మంజూరు చేసిందని అన్నారు. త్వరలోనే వీటిని ఆయా గ్రామ పంచాయతీలకు చేర్చి, ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వ్యాధుల ముట్టడి!

గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు ● పట్టించుకోని అధికారులు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో జ్వరాలు తీవ్రమయ్యాయి. ఏ గ్రామంలో చూసినా జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యన నీరు నిలిచిపోతోంది. మురుగు, వర్షపు నీరు కలిసి రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే మంచినీరు కూడా కలుషితమై వస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించి, గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.




చాగలమర్రిలోని భూమా నగర్‌లో జ్వరంతో బాధపడుతున్న ప్రజలు

చాగలమర్రి, సెప్టెంబరు 4: గ్రామాల్లో విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిలో ఇంటికి ఒకరిద్దరు చొప్పున మంచం పట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. మండలంలో బ్రాహ్మణపల్లె, మద్దూరు, ముత్యాలపాడు, మల్లెవేముల, చాగలమర్రి, కేపీ తాండ, ఎం.తాండ, శెట్టివీడు, గొడిగనూరు తదితర గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజుల తరబడి జ్వరాలు తగ్గక పోవడం, అది అసాధారణ జ్వరమా, వైరల్ ఫివర్ అని రోగులు భయపడుతున్నారు. వారం పది రోజులుగా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా రోజుకు 100 నుంచి 150 మంది దాక వైద్య చికిత్సలు చేయించుకుంటుండగా వారిలో సగం మంది జ్వరాలతో వచ్చిన వారే ఉంటున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన పారిశుధ్యం అధ్వానంగా మారింది. అనేక చోట్ల మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దోమ కాటు వల్ల జ్వరాల బారిన పడుతున్నారు. కనీసం మురుగు కాలువల్లో హెబెట్ ద్రావణం కానీ, బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలను మూలనపడేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరో పక్క గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నా వైద్యులు, సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి పారిశుధ్యం, కలుషిత నీరు లేకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పెద్దబోదనం ఎస్సీ కాలనీలో నిలిచిన మురుగు నీరు

జాగ్రత్తలు పాటించాలి

ఇటీవల కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పారిశుధ్య లోపం, దోమల వల్లే ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఇంటి చుట్టూ, పరిసరాల్లో మురుగునీరు, చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకోవాలి.

- ఇమ్రాన్, వైద్యుడు

కొలిమిగుండ్ల: మండలంలో బెలుం, మీర్జాపురం, బెలుంశింగవరం, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, చింతలాయపల్లె తదితర గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. అధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వరదల్లోనూ వైసీపీ నీచ రాజకీయాలు

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్, సెప్టెంబరు 4: విజయవాడను ముంచెత్తిన వరదలతో ప్రజలు బాధ పడుతుండగా.. వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం డోన్‌లో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ వరదలతో విజయవాడ అతలాకుతలం కావడంతో బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు అహోరాత్రులు శ్రమిస్తున్నారన్నారు. అర్ధరాత్రి వేళల్లో కూడా పడవల్లో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు సహాయక చర్యలు అందేలా చూస్తున్నారన్నారు. మంత్రులు, అధికార యంత్రాంగానికి బాధ్యతలు అప్పగించి బాధితులకు ఆహారం, నీళ్లు, వైద్యానికి సంబంధించిన మందులను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. సీఎం స్థాయిలో ఉన్నప్పటికీ చంద్రబాబు స్వయంగా బాధితులతో మాట్లాడుతూ పర్యవేక్షణ చేస్తుండడం వైసీపీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్ బాధితులకు సాయం అందడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకోవాల్సిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వంపై వైసీపీ బురదజల్లడం మానుకుని చేతనైతే బాధితులకు సాయం అందించాలన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి


బ్రాహ్మణపల్లె వంతెనపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న అధికారులు

చాగలమర్రి, సెప్టెంబరు 4: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఏఎస్ఐ నబీసాహెబ్ తెలిపారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లె వక్కిలేరు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలు వక్కిలేరు వంతెన దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. మట్టిమిద్దెల్లో నివాసం ఉండరాదని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దరకు వెళ్లి ప్రమాదాలు తెచ్చుకోరాదని అన్నారు. వారి వెంట కార్యదర్శి మనోజ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, పోలీసులు ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

దొర్నిపాడు: గ్రామాల్లో ప్రజలు వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో గ్రామ పెద్దలు, వినాయక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే ముందు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రంగయ్య, మౌళాలి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్యాపిలి, సెప్టెంబరు 4: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడు అన్నారు. బుధవారం పట్టణంలోని రెండవ సచివాలయంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగనవాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని ఆయన సూచించారు.

వరద బాధితులను ఆదుకుందాం: ఎమ్మెల్యే



ఆళ్లగడ్డ, సెప్టెంబరు 4: విజయవాడ వరద బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకుందామని ఎమ్మెల్యే అఖిలప్రియ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విజయవాడలోని బుడమేరు వాగు పొంగి పొర్లడంతో వరదలు సంభవించాయన్నారు. అక్కడి ప్రజలను తమ వంతు సహాయార్థం ఆదుకునేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఆళ్లగడ్డకు విజయవాడలోని 43వ డివిజన్ సీఎం కేటాయించారని, ముందుగా కమిషనర్ వెంకటరామిరెడ్డి అక్కడ ఉన్నారని, తాను కూడా అక్కడికి వెళ్లి వరదలు తగ్గే వరకు వరద బాధితులకు భోజనం, మంచినీరు శోభా ట్రస్టు తరఫున అందిస్తామన్నారు. శోభా ట్రస్టు తరపున రూ.5 లక్షలు విరాళంగా అక్కడి కలెక్టరుకు చెక్కు ఇస్తానని తెలిపారు.


క్రిష్టిపాడులో కూలిన మట్టి మిద్దెను పరిశీలిస్తున్న వీఆర్వో సాంబశివుడు

కూలిన మట్టిమిద్దెలు


రుద్రవరం మండలంలోని తిప్పారెడ్డిపల్లెలో కూలిన మట్టిమిద్దె

దొర్నిపాడు, సెప్టెంబరు 4: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన మస్కిన్ సాబ్‌గారి పక్రుద్దీన్, దావాజీ గారి దస్తగిరిలకు చెందిన మట్టిమిద్దెలు కూలిపోయాయి. మంగళవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా గాలి, వర్షంతో మట్టిమిద్దెలు కూలి ప్రమాదం తప్పింది. ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో మట్టి పక్కన కూలడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఇంటిలోని టీవీ, కొన్ని వస్తు సామగ్రి దెబ్బతిన్నాయి. బుధవారం వీఆర్వో సాంబశివుడు, రెవెన్యూ సిబ్బంది పడిపోయిన మట్టిమిద్దెలను పరిశీలించి సంబంధిత అధికారులకు నివేదికను అందజేస్తామని అన్నారు.

రుద్రవరం: మండలంలో గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవాం అర్ధరాత్రి మూడు మట్టిమిద్దెలు కూలినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. తిప్పారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి మట్టి మిద్దె కూలినట్లు బుధవారం బాధిత వృద్ధురాలు వెంకటమ్మ వాపోయింది. పెద్దకంబలూరు గ్రామంలో గురప్ప, మరో వ్యక్తికి చెందిన రెండు మట్టి మిద్దెలు కూలాయి. సుమారు రూ.80వేలు ఆస్తి నష్టం కలిగినట్లు తహసీల్దారు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థికసాయం కింద బియ్యం, కందిపప్పు అందించినట్లు తెలిపారు. సమగ్రంగా విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. మట్టిమిద్దెల్లో నిద్రించరాదని ప్రతి గ్రామంలో టాంటాం వేయించాలని గ్రామ వీఆర్వోలను ఆదేశించినట్లు తహసీల్దారు తెలిపారు.

నీట మునిగిన పంటలు


కలుగొట్లపల్లె వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

రుద్రవరం, సెప్టెంబరు 4: మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. 19వ గంగ బ్లాక్‌ఛానెల్‌లో వాగు, పంట పొలాల్లో నీరు పొంగి ప్రవహించింది. మందలూరు సమీపంలో వాగు నీరు 19వ బ్లాక్‌ఛానెల్‌లో చేరడంతో గండి పడిందని రైతులు వాపోయారు. 60 ఎకరాల్లో వరి, మినుము పంటలు నీట మునిగాయి. మూడురోజుల వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పనపల్లె రహదారిలో వేప చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

వర్క్‌షాప్‌నకు హాజరు కావాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 4 : కొలిమిగుండ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల విజన్ ప్లాన్ తయారీపై గురువారం జరిగే వర్క్‌షాప్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు 2024-25 నుంచి 2028-29 వరకు మండల అభివృద్ధి కోసం ఆయా శాఖల వారిగా విజన్ ప్లాన్ తయారు చేయాల్సి ఉందని, అధికారులు హాజరై చర్చించాలని ఆయన తెలిపారు.

పీహెచ్‌ఎన్‌గా అనసూయమ్మ

రుద్రవరం, సెప్టెంబరు 4 : రుద్రవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పబ్లిక్ హెల్త్ నర్సుగా అనసూయమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు వైద్యురాలు జ్యోతి తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమర్రి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ సూపర్‌వైజరుగా పనిచేస్తూ ఇక్కడికి పబ్లిక్ హెల్త్ నర్సుగా పదోన్నతిపై వచ్చారని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక


గంగాధర్‌రెడ్డి, బనగానపల్లె జడ్పీ బాలికల ఉన్నతపాఠశాల హెచ్‌ఎం


రామచంద్రారెడ్డి, ఇల్లూరుకొత్తపేట జడ్పీ ఉన్నతపాఠశాలలో స్కూల్ అసిస్టెంట్


మహమ్మద్ రఫీక్ పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల


టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హరినాథ్‌గౌడ్


జె.విజయ, యనకండ్ల ఎస్సీ ఎంపీపీ పాఠశాల


ప్రతాప్ బనగానపల్లె ఎంపీపీ పాఠశాల


ముకుందరెడ్డి, బత్తులూరు ప్రాథమిక పాఠశాల


రామలక్ష్మమ్మ బాలికోన్నత పాఠశాల, చాగలమర్రి


బషీర్‌అహ్మద్, అవుకు ఏపీ మోడల్‌స్కూల్

జిల్లాలోని ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్లు, పీజీటీ, టీజీటీలు, సెంకడరీ గ్రేడ్ టీచర్లు ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడం పట్ల పలువురు వీరిని అభినందించారు. గురువారం నంద్యాలలో జరిగే జిల్లా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొని అవార్డు అందుకుంటారు.


ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా డోన్‌లో మండల విద్యాధికారులను సన్మానిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

విద్యుత్ బిల్లులు తగ్గించుకోండి


మాట్లాడుతున్న ఏఈ రామ్మోహన్

కోవెలకుంట్ల, సెప్టెంబరు 4 : ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని మండల విద్యుత్ ఏఈ రామ్మోహన్ తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సయ్యదున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు వారి ప్రగతిని చదివి వినిపించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. విద్యుత్ ఏఈ రామ్మోహన్ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే డబ్బులు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ రాధికారెడ్డి, ఏవో నిరంజన్, ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏపీవో శ్రీవిద్య, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, టీడీపీ ఎంపీటీసీ కత్తి ఓబులేసు, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి


గూటుపల్లె గ్రామంలో ఈకేవైసీ చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

బేతంచెర్ల, సెప్టెంబరు 4: మండలంలోని గ్రామాల్లో పంట నమోదు చేయించుకున్న రైతులు వెంటనే తమ రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ సూచించారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పంట నష్ట పరిహారం, పంట బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు మద్దతు ధరకు పంట విక్రయాలు వంటి పథకాలకు అర్హులు అవుతారని తెలిపారు. బుధవారం మండలంలోని అంబాపురం గ్రామంలో హార్టికల్చర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, ఆర్ ఎస్ రంగాపురంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోద, ఏఈవో బన్ని రాజు, గూటుపల్లెలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు రాజు నాయక్, రవితేజ, బేతంచెర్లలో సద్దాంహుశేన్, కొలుములపల్లెలో అంజలిలు ఈకేవైసీ చేయించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.